
కొల్చారంలో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న ఎంపీపీ మంజుల, సర్పంచ్ ఉమ


దంతాన్‌పల్లిలో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి

# కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కారు చీకట్లే..

**● బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మాటలు నమ్మొద్దు: ఎంపీపీ మంజుల ● గ్రామ గ్రామాన జోరుగా సాగుతున్న ఇంటింటీ ప్రచారం**

కొల్చారం/నర్సాపూర్/శివ్వంపేట, నవంబర్ 21: కాంగ్రెస్‌ను నమ్ముకుంటే కారు చీకట్లేనని, రైతులకు అండగా ఉంటున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు వేయాలని కొల్చారం ఎంపీపీ మంజుల ప్రజలను అభ్యర్థించారు. శుక్రవారం కొల్చారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ఇంటింటికీ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ అమలుచేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను మండలంలోని గ్రామ గ్రామాన ఇంటింటికీ వివరిస్తూ.. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని, కారు గుర్తుకే ఓటేసి నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కొల్చారంలో జరిగిన ఇంటింటికీ ప్రచారంలో ఎంపీపీ మంజుల, సర్పంచ్ కరెంటు ఉమ, మండల బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు కోనాపూర్ సంతోశ్ రావు, బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్, కృష్ణాగౌడ్, రాజాగౌడ్, చిన్నరాములు పాల్గొన్నారు. అంసాన్‌పల్లిలో జరిగిన ఇంటింటికీ ప్రచారంలో సర్పంచ్ మన్నె శ్రీనివాస్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సొసైటీ చైర్మన్ మన్నె రాములు పాల్గొన్నారు. కొంగోడులో జరిగిన ప్రచారంలో సర్పంచ్ మంజుల సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ ఉదయ వేమారెడ్డి కారు గుర్తుకే ఓటు వేసి సునీతారెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో సోమ నర్సింహులు, రవీందర్, ఆత్మ డైరెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

☛ నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి అన్నారు. శుక్రవారం శివ్వంపేట మండలంలోని దంతాన్‌పల్లిలో సర్పంచ్ కన్నారం దుర్గేశ్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు మొలుగు నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దుర్గం రమేశ్, సిద్ధిరాములు, నాగభూషణం, తిరుపతిరావు, శ్రీనివాస్, గజేంద్ర నర్సింలు, వెంకటరాంములు, గోపాల్ యాదవ్, శేఖర్‌యాదవ్, పర్వతాలు, మహేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.


బ్రాహ్మణపల్లిలోని విఠల్‌తండాలో ప్రచారాన్ని చేస్తున్న పీఏసీఎస్ మాజీ చైర్మన్

☛ నర్సాపూర్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి మద్దతుగా బీఆర్ఎస్ నాయకులతో పాటు కాలనీవాసులు కదంతొక్కారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 15వ వార్డు కౌన్సిలర్ లలితాభిక్షపతి ఆధ్వర్యంలో సుమారు 200 మంది ప్రజలు ఇంటింటికీ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టి కారు గుర్తుకు ఓటేసి సునీతాలక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

☛ నర్సాపూర్‌లో సునీతాలక్ష్మారెడ్డి విజయం ఖాయమని పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్యాగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని గుర్జాతండా, విఠల్‌తండాలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డికి మద్దతుగా పీఏసీఎస్ మాజీ చైర్మన్ సత్యాగౌడ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు ఇంటింటికీ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తూ.. కారు గుర్తుకు ఓటేసి సునీతారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంజరి శ్రీనివాస్, నర్సింగ్ నాయక్, కొండల్, విఠల్, కమ్మరి నర్సింహులు, పుట్టి కిషన్, చాకలి కృష్ణ, నీరుడి శ్రీనివాస్, ఆశిలి నర్సింహులు, కమ్మరి రాజు, యువకులు పాల్గొన్నారు.


నర్సాపూర్ మున్సిపల్ 15వ వార్డులో కౌన్సిలర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రచారం


కొల్చారం: కొంగోడులో ఇంటింటికీ ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


కాగజ్‌మద్దూర్ గ్రామం పెద్దమ్మతండాలో యువనాయకుడు సంతోశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న గిరిజనులు

## బీఆర్ఎస్‌లో చేరిన గిరిజనులు

నర్సాపూర్, నవంబర్24: నర్సాపూర్ నియోజకవర్గంలో ఇతరపార్టీల నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలుపర్చిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి కాంగ్రెస్, బీజేపీ నుంచి వలసలు ఊపందుకున్నాయి. శుక్రవారం మండలంలోని కాగజ్‌మద్దూర్ గ్రామం పెద్దమ్మతండాకు చెందిన కాంగ్రెస్ వార్డు మెంబర్ రాజు, మాజీ ఎంపీటీసీ సువర్ణతో పాటు సుమారు 80 మంది గిరిజనులు బీఆర్ఎస్ యువనాయకుడు సంతోశ్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో చేరినవారిలో గోపాల్, కుమా ర్, సోమ్లా, రాజు, యాదయ్య, సాయి తదితరులు ఉన్నారు.

## ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు

నర్సాపూర్, నవంబర్ 24: ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు పీవోస్, ఏపీవోస్‌లకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలో పీవోస్, ఏపీవోస్‌లకు నిర్వహించిన తరగతులను నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో


కొల్చారం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో గణేశ్‌రెడ్డి

కొల్చారం, నవంబర్ 24: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న నర్సరీ పనులు, పోలింగ్ కేంద్రాలను ఎంపీడీవో గణేశ్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని తుక్కాపూర్, పైతర, ఏటిగడ్డమాందాపూర్, కోనాపూర్, ఎనగండ్ల, రంగంపేట, సంగాయిపేట, చిన్నాఘన్‌పూర్ గ్రామాల్లో జరుగుతున్న నర్సరీ పనులను పరిశీలించారు. అలాగే ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో మహిపాల్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది, బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన

నర్సాపూర్, నవంబర్24: యువత ఓటు హక్కును సద్వినియోగపరుచుకోవాలని డీడబ్ల్యూవో బ్రహ్మాజీ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దచింతకుంట గ్రామ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నర్సాపూర్ పట్టణంలోని ఎల్లంకి డిగ్రీ కళాశాలలో డీడబ్ల్యూవో బ్రహ్మాజీ విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మద్యం, డబ్బులు, ఇతర ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ హేమభార్గవి, ఏఆర్ఈఎస్ స్వచ్ఛంద సంస్థ సెక్రటరీ సునీతారాకేశ్, ప్రిన్సిపాల్ లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా

పాపన్నపేట, నవంబర్ 24: కోరం లేక ఈ నెల 24న (శుక్రవారం) జరగాల్సిన పాపన్నపేట మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు మండల పరిషత్ అధ్యక్షురాలు చందనాప్రశాంత్ రెడ్డి తెలిపారు. మండల వ్యాప్తంగా 15 మంది ఎంపీటీసీ సభ్యులు ఉండగా శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి కేవలం ఇద్దరు ఎంపీటీసీలు మాత్రమే హాజరు కావడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీపీ వెల్లడించారు.

## బీవీఆర్ఐటీలో 'స్టడీ అబ్రాడ్ ఫెయిర్'

నర్సాపూర్, నవంబర్ 24: నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాలలో 'గ్లోబల్ ఎడ్యూకేషన్ కేరీర్స్ ఫోరమ్' సహకారంతో శుక్రవారం 'స్టడీ అబ్రాడ్ ఫెయిర్'ను నిర్వహించారు. కార్యక్రమంలో 20 పైగా యూనివర్సిటీలు, 300లకు పైగా విద్యార్థులు పాల్గొన్నారు. పైచదువులకు ఇతర దేశాలకు వెళ్లాలనుకునే వారికి ఈ కార్యక్రమం ద్వారా ఎన్నో సలహాలు, సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కొల్చారం: గాలి అనిల్‌కుమార్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్న సొసైటీ డైరెక్టర్ జీవయ్య

## బీఆర్ఎస్‌లో చేరిన సొసైటీ డైరెక్టర్ జీవయ్య

కొల్చారం, నవంబర్ 24: కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్ బట్ట జీవయ్య సొంత (బీఆర్ఎస్) గూటికి చేరుకున్నారు. ఇటీవల బుట్ట జీవయ్య కాంగ్రెస్‌లో చేరగా, నర్సాపూర్ బీఆర్ఎస్ ఎన్నికల కమిటీ కొల్చారం మండల ఇన్‌చార్జి గాలి అనిల్‌కుమార్ సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు గాలి అనిల్‌కుమార్ గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజుల, పైతర సర్పంచ్ సంతోష, ఎంపీటీసీ ఎల్లయ్య, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, మండల గౌడ సంఘం నాయకుడు వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భర్త స్నేహితుడినని నమ్మించి పుస్తెలతాడు చోరీ


విలపిస్తున్న రమ్య, (ఇన్‌సెట్లో) బైక్‌పై వెళ్తున్న నిందితుడు

రామాయంపేట, నవంబర్ 24: ఓ మహిళకు తన భర్త స్నేహితుడినని మాయమాటలు చెప్పి మహిళ మెడలోని మూడు తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లిన ఘటన రామాయంపేట పురపాలిక పరిధిలోని గొల్పర్తి గ్రామంలో శుక్రవారం జరిగింది. రామాయంపేట పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రమ్య ఇంట్లో బీడీలు చుడుతుండగా గుర్తుతెలియని ఓ వ్యక్తి వచ్చి, తను మీ (రమ్య) భర్త స్నేహితుడినని నమ్మించి, సెల్‌ఫోన్‌లో పుస్తెల తాడును ఫొటో తీసుకుని ఇస్తానని నమ్మించాడు. నిందితుడు 15 నిమిషాలపాటు ఇంట్లోనే కూర్చుని మాయమాటలు చెప్పి, ఆమె వద్ద ఉన్న సెల్‌ను తీసుకుని బాగుచేస్తానని నమ్మించాడు. తన భర్త ఫ్రెండే కదా అని గుర్తుతెలియని వ్యక్తికి తన మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడును తీసి ఇచ్చినట్లు బాధితురాలు విలేకరులకు తెలిపింది. పుస్తెల తాడు ఇవ్వడంతోనే తాను వచ్చిన బైక్‌పై ఆ వ్యక్తి వెళ్లాడని తెలిపింది. ఆ వ్యక్తి వెళ్లిన తర్వాత, తాను స్పృహలోకి వచ్చి మెడలో చూసుకునేసరికి మెడలో పుస్తెల తాడుతో పాటు సెల్‌ఫోన్‌లో ఉన్న సిమ్‌కార్డును కూడా తీసివేసినట్లు తెలిపింది. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాయంపేట ఎస్సై,రంజిత్ వెల్లడించారు.